క్లుప్తంగా

16న సీఎం కప్ క్రీడలు

నర్మెట: ప్రభుత్వం తలపెట్టిన సీఎం కప్–2023 క్రీడాపోటీలు ఈనెల 16వ తేదీన మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిచనున్నట్లు ఎంపీడీఓ ఎండీ ఖాజామొయినొద్దీన్ శనివారం తెలిపారు. పరుగుపందెం, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో పాల్గొను 15 నుంచి 36 ఏళ్ల వయసుగల వారు తమ ఆధార్ కార్డుతో 16న ఉదయం 8 గంటల వరకు క్రీడాప్రాంగణంలో పీఈటీని సంప్రదించాలని సూచించారు.

విరాళం



దేవరుప్పుల: మండలంలోని అప్పిరెడ్డిపల్లెలో భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు పెద్దమడూరుకు చెందిన బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు రూ.50 వేల విరాళాన్ని సర్పంచ్ సుధాకర్‌కు అందజేశారు. శ్రీనివాస్, నల్ల ఉమేష్, ఎంపీటీసీ గిరి, ఆకవరం పెద్దారెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, బబ్బూరి రవి, అశోక్, కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

జనగామ రూరల్: పట్టణానికి చెందిన లయన్ శ్రీరామ్ శ్రీనివాస్, సంధ్యల కుమారుడు శ్రీరామ్ రామ్ శ్రావణి పెళ్లిరోజు సందర్భంగా జనగామలోని వర్ధన్ ఆశ్రమంలో శనివారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌సీ ఏనుగు నర్సిరెడ్డి, క్లబ్ సభ్యులు దాసరి సుమన్, వేణుగోపాల్‌రెడ్డి, నిర్వాహకురాలు కత్తుల లక్ష్మి పాల్గొన్నారు.

బియ్యం..

బచ్చన్నపేట: మండలంలోని వంగ సుదర్శన్ రెడ్డి నగర్‌లో ఇటీవల మృతి చెందిన మహమ్మద్ గఫూర్ కుటుంబ సభ్యులకు బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు ఎనుగుల ఎర్ర రామయ్య 25 కిలోల బియ్యం అందజేశారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆత్మహత్య

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ ఆటో డ్రైవర్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ శివారులో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రఘునాథపల్లికి చెందిన కడారి నర్సింహులు (32) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్లుగా ఆటో నడవక ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన నర్సింహులు నిడిగొండ శివారులోని మామిడి తోట వద్దకు వెళ్లి ఉరివేసుకొని మృతి చెందాడు. గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నర్సింహులుకు భార్యతో పాటు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



స్టేషన్‌ఘన్‌పూర్: గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి 25 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్–ఇప్పగూడెం రైల్వేస్టేషన్ల మధ్య ఛాగల్లు శివారులో శనివారం జరిగింది. జీఆర్‌పీ కాజీపేట ఎస్సై పరుశురాములు తెలిపిన వివరాల ప్రకారం. ఘన్‌పూర్– ఇప్పగూడెం రైల్వేస్టేషన్ల మధ్య 301/506 కిలోమీటర్ మైలురాయి వద్ద అప్ అండ్ డౌన్ రైలు పట్టాల మధ్యలో కంకరపై గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు గుర్తించామన్నారు. ఏదో రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఉంటాడని, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. సికింద్రాబాద్ నుంచి రాయచూర్‌కు వెళ్లే రైల్వే టికెట్ మాత్రమే ఉందని, ఇతర ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడు ఎరుపు రంగు ఉన్నాడని, పిల్లి గడ్డం ఉందని, నీలం రంగు ఫుల్ షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరుస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

రఘునాథపల్లి: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వెల్ది గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామానికి చెందిన కొయ్యడ పవన్‌కళ్యాన్ (20) తన సోదరుడు కొయ్యడ నవీన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఈ నెల 2న దేవరుప్పుల మండలం చిన్నమడూరుకు బయలు దేరారు. మండల కేంద్రంలోని కంఠమహేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో అన్నదమ్ములు ఎగిరి రోడ్డుపై పడటంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పవన్‌కళ్యాన్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందంజ

నర్మెట: దేశంలో మరెక్కడాలేని విధంగా పలు సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కేసీఆరే మూడోసారి ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఐకేపీ భవనంలో శనివారం ఆయన 32 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందించి మాట్లాడారు. కేసీఆర్ పథకాలతో పుట్టిన ప్రతీ బిడ్డ నుంచి పెళ్లి వరకు, గర్భిణీ, బాలింత, ఆసరా పింఛన్లు తదితరాలతో లబ్ధి చేకూరుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అఖండ విజయాన్ని అందించి ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. యాదవ కాలనీలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ మిగులు పనుల నిమిత్తం రూ. 5 లక్షల సీడీఎఫ్ నిధులను అందిస్తానని హామీ ఇచ్చారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, తహసీల్దార్ పారునంది శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ ఎండి గౌస్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామిని శివరాజ్ గుప్తా, ఆమెడపు కమలాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నక్కల గట్టయ్య, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, నీరటి సుధాకర్ జయరాం, రమేష్, నరేందర్, రవి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

రఘునాథపల్లి: గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. శనివారం మండలంలోని రామరాయని బంగ్లాలో సీడీపీ నిధులతో మంజూరైన రూ. 10 లక్షల సీసీ రోడ్లు, ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో మంజూరైన రూ.20 లక్షల గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బక్క యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్షయపాత్ర లాంటిదని అడగక ముందే అన్ని సమకూర్చే అమ్మలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్, ఉప సర్పంచ్ మారబోయిన మమత సుధీర్, బీఆర్‌ఎస్ నాయకులు ముసిపట్ల విజయ్, నామాల బుచ్చయ్య, చీమలపాటి రవీందర్, పరుశరాములు, మడ్లపల్లి సునీత, మమత, రమ్య తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

లింగాలఘణపురం: గ్రామాలను అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. శనివారం మండలంలోని కుందారంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.80 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చాడ సుగుణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు అంతగల్ల రాంచందర్, యాకయ్య, ఆగరాజు, డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



జనగామ: ఆర్టీసీ చౌరస్తాలో పొన్నాల వర్గీయుల సంబురాలు



జనగామ: స్వీట్లు తినిపించుకుంటున్న కొమ్మూరి వర్గీయులు

జనగామ/నర్మెట/బచ్చన్నపేట/తరిగొప్పుల/కొడకండ్ల/స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి/చిల్పూరు/పాలకుర్తిటౌన్/దేవరుప్పుల: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనంతో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశంలో రానున్నది ఇందిరమ్మ రాజ్యమేనని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మాసంపల్లి లింగాజీ, ఉడుత రవి, ధర్మపురి శ్రీనివాస్, జక్కుల వేణు మాధవ్, కీసర దిలీప్‌రెడ్డి, చింతకింది మల్లేష్, లోక్కుంట్ల ప్రవీణ్, ఎండీ మాజీద్, సిద్దారెడ్డి, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, నర్సిరెడ్డి, నర్సింగరావు, చందర్, సతీష్, అంజయ్య, రవిగౌడ్, క్రాంతి కుమార్, ఫరీదుల యాదయ్య, మధు గుప్తా, రాంచందర్,



స్టేషన్‌ఘన్‌పూర్: స్వీట్లు పంపిణీ చేస్తున్న చేపూరి చిరంజీవి

రామకృష్ణ, శ్రీను, హరియానాయక్, కరుణాకర్, అశోక్, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, చేపూరి చిరంజీవి, వెంకట్‌రెడ్డి, మహాత్మాచారి, శ్రీనివాస్, యాదగిరి, వేణువంద, ఎల్లయ్య, ఉషా కిరణ్, సది, మల్లరాజయ్య, పెద్ది కృష్ణమూర్తి, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, గడ్డమీది సురేష్, గంగు కృష్ణమూర్తి, గడ్డం యాకసోమయ్య తదితరులు పాల్గొన్నారు.



తరిగొప్పులలో..



బచ్చన్నపేటలో..

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న యాదగిరి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని శివునిపల్లికి చెందిన గోరంట్ల యాదగిరి నియమితులయ్యారు. ఈ మేరకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ చేతుల మీదుగా వరంగల్ క్యాంపు కార్యాలయంలో యాదగిరి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిలో నియమించిన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ముదిరాజ్ యువత, మహిళా విభాగాలు, అనుబంధ విభాగాలకు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల సంప్రదింపులతో కమిటీలను నిర్మాణం చేస్తాననన్నారు. తన ఎన్నికకు సహకరించిన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అశోక్, యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గట్టయ్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

అభినందనీయం



లింగాలఘణపురం: నల్లమల అడవుల్లోని చెంచు గిరిజనులకు సాయం చేయడం అభినందనీయమని జనగామ జిల్లా ఎంపీపీ ఫోరం అధ్యక్షురాలు, లింగాలఘణపురం ఎంపీపీ చిట్ల జయశ్రీ అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్ కల్లెం శ్రీనివాసురెడ్డి, తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సహకారంలో శ్రీశైలం నల్లమల అడవుల్లోని రాంపూర్ గిరిజనులకు లయన్స్ క్లబ్ హైదరాబాద్ వారు అందజేసిన వంట పాత్రలు, ఆట వస్తువులు, దుస్తులు ఎంపీపీ జయశ్రీ అందజేశారు.

బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేస్తాం

రఘునాథపల్లి: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ మడ్లపల్లి సునీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సునీత మాట్లాడుతూ తనకు రెండో సారి నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట

కొడకండ్ల: కులవృత్తుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి(కేవీఆర్) అన్నారు. ప్రమాదావశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి గాయపడిన పాకాలకు చెందిన పల్లె మొగిలి, రామవరానికి చెందిన కారుపోతుల సోమయ్యలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.15 వేల ఎక్స్‌గ్రేషియా చెక్కులను శనివారం ఆయన అందజేశారు. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ,మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలు శిరీష, మణెమ్మ, సోమరాములు, రాజిరెడ్డి, మల్లేష్, నారాయణరెడ్డి,



చెక్కు అందజేస్తున్న కేవీఆర్

ప్రవీణ్, ప్రేమ్‌కుమార్, సతీష్‌గౌడ్, శ్రీను, చంద్రమౌళి, మహేష్, సోమయ్య పాల్గొన్నారు.

‘ప్రతీ ఇంటికి కాంగ్రెస్ పార్టీ విజన్’



పాంనూర్‌లో పాదయాత్రలో చేపూరి వినోద్

స్టేషన్‌ఘన్‌పూర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సందేశం, కాంగ్రెస్ పార్టీ విజన్‌ను నియోజకవర్గంలో ఇంటింటికీ తీసుకెళ్లడమే తన ధ్యేయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి వినోద్ అన్నారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న అవినీతిపై ప్రజలను చైతన్యం చేసేలా చేపూరి వినోద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర శనివారంతో రెండో రోజుకు చేరింది. మండలంలోని పాంనూర్, సమిలిగొండ గ్రామాల్లో పాదయాత్ర చేసి ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం

జనగామ రూరల్: రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పి ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి జనార్దన్ అన్నారు. శనివారం జిల్లాలోని పలు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు సందర్శించారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఐకేపీ గ్రూపుల పేరుతో ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహిస్తూ రైతును ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. రైతు వేదికలను ఉపయోగించుకొని వసతులు కల్పించాలని, సౌకర్యం కోసం ధాన్యం నిల్వల సామర్థం బట్టి షెడ్ల



మాట్లాడుతున్న జనార్దన్

నిర్మాణం చేయాలన్నారు. ఐలయ్య, బాలరాజు, కుమారస్వామి, రాజు, ఎల్లేష్, మల్లేషం ఉన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

రఘునాథపల్లి/తరిగొప్పుల: మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవాకేంద్రాల్లో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రఘునాథపల్లి, తరిగొప్పుల మండల వ్యవసాయాధికారులు కాకి శ్రీనివాస్‌రెడ్డి, సంతోషి శనివారం వేర్వేరు ప్రకటనలో తెలియజేశారు. 30 కేజీల జీలుగ విత్తనాల బ్యాగు సబ్సిడీపై రూ 842లు చెల్లించి పొందవచ్చన్నారు. వరి, మిరప సాగు చేసే రైతులు తప్పని సరి జీలుగ విత్తనాలు వాడుకోవలన్నారు. అవసరమయ్యే రైతులు ఆగ్రో సేవాకేంద్రంలో, లేదా వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించాలని వారు సూచించారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



కొడకండ్ల: శోభాయాత్రను ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

కొడకండ్ల: మండలకేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణ స్వాములు, బజరంగ్‌దళ్ సభ్యులు, పరివార్ క్షేత్ర కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా యాత్రను బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. పాత హనుమాన్ ఆలయం నుంచి బ్లాక్ ఆఫీస్, బస్టాండ్ చౌరస్తా, గాంధీచౌక్‌ల మీదుగా నాగులమ్మ ఆలయం వరకు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఊరేగిస్తూ స్వాములు భజనలు, నృత్యాలతో నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారు. శ్రీమాన్, చంద్రయ్య, కోటేశ్వర్ రావు, సోమన్న, ఉపేందర్, శ్రీనివాస్, గురుస్వామి ఉపేందర్, రాజు, నవీన్, ఆంజనేయులు, సాయి, వినయ్, రాకేష్, రమేష్, సంపత్ పాల్గొన్నారు.

నేడు ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: హనుమాన్ జయంతి సందర్భంగా డివిజన్ కేంద్రంలో ఘన్‌పూర్ హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా హనుమాన్ శోభాయాత్రను నిర్వహించనున్నట్లు గురస్వాములు గోనెల ఎల్లయ్య, ఇల్లందుల ప్రసాద్ తెలిపారు. హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. హనుమాన్ భక్త మండలి బాధ్యులు బంగ్లా శ్రీను, మొగుదుంపురం కిషోర్, గోనెల రాజేందర్, గోనెల శ్రీను, గోనెల ఉప్పలయ్య, లింగం పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన

దేవరుప్పుల: మండలంలోని సీతారాంపురంలో శ్రీ ఉమాచంద్రమౌలీశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన చేశారు. పూజారులు ఉప్పల గిరిప్రసాద్‌శర్మ, లింగమయ్య ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో విగ్రహ ప్రతిష్ఠాపన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రిమల్లేషం, సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్, మాజీ ఎంపీటీసీ వెంకన్న, రతన్‌జీ, బస్వ రామచంద్రు, గుంటి అజయ్. రమేష్, హనుమాన్ స్వాముల బృందం పాల్గొన్నారు.

హోమం

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని శివాలయంలో శనివారం హనుమాన్ మాలధారులు హోమం నిర్వహించారు. వేదపండితులు ఉమానాథశర్మ వేదమంత్రోచ్చారణలతో హోమం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. గ్రామంలోని భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ మాలధారులు జుట్టు యాకేశ్, కాసోజు సత్యం, బొంకూరి రమేష్, కేమిడి సత్యనారాయణ, తూడి వెంకటేశ్, కడకంచి మల్లేశం, మహేశ్వరం సంతోష్ పాల్గొన్నారు.

నివాళి

జనగామ రూరల్: కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న జేపీఎస్‌ల సమ్మె శనివారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేపీఎస్ సోని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి పాటుపడుతున్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా బెదిరింపులకు ప్రభుత్వం పాల్పడడం సరికాదని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సర్వీస్ క్రమబద్ధీకరణ చేసి ఆదుకోవాలని అన్నారు. అనంతరం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోని అంత్యక్రియలకు జనగామ జిల్లా నుంచి జేపీఎస్‌లు తరలి వెళ్లారు. రంగారెడ్డి, రమ్య, మహేందర్, సంతోష్, రాజు, వాణిశ్రీ పాల్గొన్నారు.

ఖుషిగుట్ట క్రషర్ల అనుమతులు రద్దు చేయాలి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ఖుషిగుట్టకు నిర్వహిస్తున్న క్రషర్ల అనుమతులను వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేసన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ క్రషర్ల నిర్వహణతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్న మంత్రి దయాకర్‌రావు ఖుషిగుట్టను రక్షించే బాధ్యతలు తీసుకోవాలన్నారు.

పంచాయతీ కార్యదర్శి గ్రామానికే రావాలి

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న వెంకట్ రెగ్యులరై తమ గ్రామానికే రావాలని గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 15 రోజులుగా పంచాయతీ కార్యదర్శి శాంతియుత సమ్మె బాటలో ఉన్నారని విధులకు హాజరు కావడం లేదన్నారు. దీంతో గ్రామంలో పలు పనులు స్తంభించి పోతున్నాయని, ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయగానే తిరిగి తమ గ్రామంలో విధులను నిర్వర్తించాలని అన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

చేయూత

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్‌కు చెందిన బసవరాజు లక్ష్మి– స్వర్గీయ రామస్వామి దంపతుల కుమార్తె వివాహం ఈనెల 14(ఆదివారం)వ తేదీన నిర్వహిస్తున్నారు. కాగా, జనగామ నియోజక వర్గ బీజేపీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ 50 కిలోల బియ్యం, సరుకులు కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కదునూరి పాండు, మహంకాళీ శివకుమార్, మునిని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులకే బీటీ రోడ్డు ధ్వంసం

లింగాలఘణపురం: మండలంలోని నాగారం–కుందారం వరకు వయా నవాబుపేట మీదుగా వేసే బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేకుండా వేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వేసిన మూడు రోజులకే రోడ్డుపై ట్రాక్టర్లు వెలితే ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో ఎంఆర్‌ఎల్ 06లో నాగారం నుంచి కుందారం వరకు వయా నవాబుపేట మీదుగా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.55 కోట్లతో 8.28 కి.మీ. రోడ్డు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. గత వారం రోజుల నుంచి బీటీ వేస్తున్నారు. పటేల్‌గూడెం – లింగాలఘణపురం మధ్యలో వేసిన బీటీ రోడ్డు వేసిన మూడు రోజులకే అక్కడక్కడ ధ్వంసమైంది. సరైన మందం వేయకపోవడంతో ట్రాక్టర్లు వెళ్లిన చోట బీటీ అంతా ధ్వంసమై కంకర తేలుతుంది. ఇప్పుడే ఇలా పోతే వర్షాకాలంలో రోడ్డు పరిస్థితి ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఐదేళ్ల వరకు రోడ్డు నిర్వహణ కాంట్రాక్టర్‌దే ఉంటుందని, బిల్లులు చెల్లించే సమయంలో క్వాలిటీ కంట్రోల్ చూస్తారని, అన్ని నిబంధనల ప్రకారం ఉంటేనే బిల్లులు ఇస్తారని చెప్పారు. ఏది ఏమైన ఐదేళ్ల నిర్వహణ కాంట్రాక్టర్‌దే ఉంటుందని సాకుతో రోడ్డు పనులను ఇష్టారాజ్యంగా చేస్తున్నారు.



ధ్వంసమైన బీటీ రోడ్డు